


sahanamvande.com

సహనం వందే

epaper.sahanamvande.com

హైదరాబాద్ | 13-10-2026 మంగళవారం | సంపుటి-02 సంచిక : 170 EDITOR: ROHINI



అన్నదాతకు 20,000 కోట్ల నష్టం

తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ నివేదిక

- పత్తి రైతులను ముంచిన ఖరీఫ్ సీజన్
- యాసంగి సగం విస్తీర్ణానికే పరిమితం
- ఆందోళన కలిగిస్తున్న వాతావరణ మార్పులు



తెలంగాణలో ఈసారి తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్ సీజన్ రైతులకు పెద్ద ఎత్తున నష్టాన్ని మిగిల్చింది. నీళ్లు లేక పాలాలు ఎండిపోవడంతో పాటు వర్షాలు పడక సాగు విస్తీర్ణం సాధారణం కంటే 25 శాతం పడిపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో వరి, పత్తి రైతులు తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఏర్పడింది. రాబోయే యాసంగి సీజన్‌లో కూడా తీవ్ర సాగు నీటి కొరత ముప్పు పొంచి ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో రాబోయే రోజుల్లో పంటలు పండక రైతులు ఇబ్బందులు పడి పరిస్థితి నెలకొంది. - సహనం వందే, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ అంచనా ప్రకారం, ఖరీఫ్‌లో ఏకంగా 20,000 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లింది. సాధారణంతో పోలిస్తే సాగు విస్తీర్ణం 25 శాతం పడిపోయింది. నీళ్లు లేక పొలాలు ఎండిపోవడం ఒకెత్తైతే, అసలు విత్తనాలే వేయకుండా వదిలేసిన భూములు మరొక ఎత్తు. దీనివల్ల పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఏర్పడింది. రాబోయే యాసంగి పరిస్థితి ఏంటి? అనేది అందు పట్టడం లేదు అంతుబట్టడం లేదు.

యాసంగి సగానికే పరిమితమా?

రాబోయే యాసంగి సీజన్‌కు కూడా సాగు నీటి కొరత ముప్పు పొంచి ఉంది. సాధారణంగా రబీలో 1.32 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. కానీ ఈసారి వర్షాభావ పరిస్థితుల వల్ల ఆ విస్తీర్ణం 70లక్షల ఎకరాలకు పడిపోయే అవకాశం ఉందంటున్నారు. ముఖ్యంగా మన దగ్గర ఎక్కువగా వేసే వరి సాగు ఏకంగా 40శాతం తగ్గే ఛాన్స్ ఉంది.దీనివల్ల ధాన్యపు దిగుబడి దారుణంగా పడిపోతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పత్తి రైతులకు శాపం...

ఖరీఫ్ సీజన్‌లో అత్యంత ఎక్కువగా దెబ్బతిన్నది మాత్రం పత్తి రైతులే. వర్షాలు లేక పత్తి చేలు ఎండిపోయాయి. అక్టోబర్ నుంచి మొదలయ్యే ఈశాన్య రుతుపవనాలపైనే రబీ ఆశలన్నీ ఆధారపడి ఉన్నాయని ఆ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ఒకవేళ అప్పుడు కూడా వానలు కురవకపోతే సాగు దండగేనని, నీటి వసతి లేని చోట తొందర పడి పెట్టుబడులు పెట్టవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాత్రం... ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో తాగు, సాగునీటికి తీవ్ర కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అందుకే రైతులు తొందరపడి యాసంగిలో వరి పంటలు వేసి నష్టపోవద్దని కోరారు. తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ విద్యుత్, నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు...

సాధారణంగా ప్రతి ఐదు నుంచి పది సంవత్సరాలకోసారి ఇలాంటి పరిస్థితులు రావడం సహజమేనని అధికారులు చెప్తున్నారు. గతంలో కూడా వర్షాభావంతో పంటల మార్పిడి 30 శాతానికి చేరింది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం 12 సార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించింది. ఎల్ నినో మార్పులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. రైతులు నీరు ఎక్కువగా అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని అవగాహన కల్పిస్తున్నారు. పప్పు ధాన్యాలు, జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేయమని కోరుతున్నారు. ఇవి తక్కువ నీటితో పండడమే కాకుండా నేలలో సారాన్ని పెంచడానికి ఎంతగానో ఉపయోగపడతాయి. నీటి వనరులను సరిగ్గా అంచనా వేసుకోకుండా విత్తనాలు, ఎరువులపై ఆత్రుతగా ఖర్చు చేసి నష్టపోవద్దని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

16 ఎల్ నినో సంవత్సరాల డేటా...

ఎల్ నినోతో కచ్చితంగా కరువే వస్తుందా అంటే కానే కాదు! చరిత్రను ఒక్కసారి తిరగేస్తే గత 16 ఎల్ నినో సంవత్సరాల డేటాను పరిశీలిస్తే ఒక్కో ఏడాది ఒక్కో రకంగా వాతావరణం ప్రవర్తించిందని స్పష్టమవుతోంది. 2002లో మైనస్ 39.3 శాతం, 2004లో మైనస్ 35.7 శాతం తక్కువ వర్షపాతం నమోదైతే, మరికొన్ని సంవత్సరాల్లో మిగులు వర్షపాతం నమోదైంది. అంటే ఎల్ నినో రాగానే కరువు వచ్చేస్తుందనే అపోహను ఈ గణాంకాలు పటాపంచలు చేస్తున్నాయి. అందుకే అంతర్జాతీయ అంచనాలపైనే కాకుండా మన ప్రాంతీయ వాతావరణ మార్పులపై దృష్టి పెట్టడం చాలా అవసరం.



45% ఖాళీలు... ఎవరూ లేరు!

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ షాకింగ్ రిపోర్ట్

- కోడింగ్ పేరుతో డెస్క్ జాబులవైపు యూత్
- డిజిటల్ ట్రాప్... డెస్క్ జాబ్... యూత్ స్లిప్
- అలాగైతే ఫోన్లు, కార్లు తయారు చేసేదెవరు?
- అంతర్జాతీయంగా కోడింగ్ యుగం ముగిసింది
- బడా కంపెనీల్లో రోబోల రాజ్యం మొదలైంది
- రోబోటిక్స్, ఆటోమేషన్‌తో మారిన రంగం
- అవకాశాలు 45%... అందుకునేది 8%

చేతులకు మట్టి అంటుకునేలా కష్టపడి చేసే పనులంటే ఈతరం యువతకు అస్సలు ఆసక్తి ఉండటం లేదు. తయారీదారులు అంటే కేవలం శారీరక శ్రమ చేసేవారే అనే ఒక పెద్ద అపోహ అందరిలో ఉండిపోయింది. కానీ నిజానికి నేటి టెక్నాలజీ యుగంలో రోబోటిక్స్, ఆటోమేషన్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ వంటివి ఈ రంగాన్నే పూర్తిగా మార్చేశాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తాజా రిపోర్ట్ ప్రకారం ఈ మార్పును యువత గ్రహించలేకపోవడం వల్లే తీవ్రమైన ఉద్యోగాల సమస్య వస్తోంది. అసలు మేకర్స్ రంగంలో జరుగుతున్న ఈ విప్లవం ఏంటి, మనం ఎక్కడ పొరపాటు చేస్తున్నాం? - సహనం వందే, హైదరాబాద్



వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మొత్తం ఉద్యోగాల్లో తయారీ రంగానికి చెందిన ఉద్యోగాల వాటా ఏకంగా 45.6శాతంగా ఉంది. అంటే దాదాపు సగం ఆర్థిక వ్యవస్థ వీళ్ల చేతుల్లోనే నడుస్తోంది. కానీ చదువుకుంటున్న విద్యార్థుల్లో కేవలం 8.5 శాతం మంది మాత్రమే ఈ రంగాన్ని తమ కెరీర్‌గా ఎంచుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

నూతన విప్లవం: డిజిటల్ మేకర్స్

రోబోటిక్స్, ఆటోమేషన్ వల్ల తయారీ రంగం పూర్తిగా రూపాంతరం చెందింది. నేటి మేకర్స్ అంటే కేవలం శారీరక శ్రమ చేసేవారు కారు. అత్యాధునిక సాఫ్ట్‌వేర్, రోబోటిక్ పరికరాలను కంట్రోల్ చేసే హైటెక్ నిపుణులు. ఈ ఆధునిక మార్పులను సమాజం, ముఖ్యంగా యువత సరిగ్గా గ్రహించలేకపోతోంది. యువత పాతకాలపు ఆలోచనలతో కేవలం డెస్క్ ఉద్యోగాల వైపు పరుగులు తీయడం వల్ల రాబోయే రోజుల్లో నిర్మాణ, విద్యుత్, తయారీ రంగాల్లో తీవ్రమైన నైపుణ్యాల కొరత ఏర్పడబోతోంది.

సాంకేతికతతో కూడిన రీబ్రాండింగ్

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సూచనల ప్రకారం మేకర్స్ రంగాన్ని సూతన సాంకేతికతతో జోడించి రీబ్రాండింగ్ చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ కలగలిపిన శిక్షణను పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అందించాలి. ఈ రంగంలో ఉండే ప్రతిభకు తగిన గుర్తింపు, ఆకర్షణీయమైన వేతనాలు, భద్రత కల్పిస్తేనే యువత ముందడుగు వేస్తుంది.

డిజిటల్ స్క్రీన్ల వెనుక ఉన్న భౌతిక ప్రపంచం


పవర్ గ్రిడ్లు, రవాణా వ్యవస్థలు, పరిశ్రమలు నిరంతరం నడవాలంటే మేకర్స్ శ్రమ తప్పనిసరి. మనం వాడే ప్రతీ కారు, ఫోన్, నివసించే భవనం వెనుక ఈ మేకర్స్ నైపుణ్యమే ఉంది. డిగ్రీ సర్టిఫికెట్ల కంటే చేతిలో ఉన్న నైపుణ్యానికే కంపెనీలు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాలు, స్మార్ట్ సిటీల నిర్మాణంలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న మేకర్స్ అవసరం విస్తృతంగా ఉండబోతోంది. పాఠశాలలు, కళాశాలల్లో థియరీ చదువుల కంటే రోబోటిక్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలి. డిజిటల్ స్క్రీన్ల వెనుక ఉన్న భౌతిక ప్రపంచం సక్రమంగా నడవాలంటే నైపుణ్యమున్న మేకర్స్ నిరంతరం అవసరం.

ఇన్ఫెక్షన్లతో క్యాన్సర్ ముప్పు

ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

- ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ నివేదిక
- ఈ కారణంగానే ఏటా 23 లక్షల కేసులు
- సిగరెట్, లిక్కర్, జెనటికల్ తోడు ఇన్ఫెక్షన్
- హెచ్‌పీవీ హెపటైటిస్‌తో తీవ్ర ముప్పు
- టీకాలు, ముందస్తు పరీక్షలతో నివారణ

మనం సాధారణంగా క్యాన్సర్ అనగానే సిగరెట్, పాగాకు తాగడం, అధిక బరువు, జంక్ ఫుడ్ లేదా జన్యుపరమైన సమస్యల వల్లే వస్తుందని అనుకుంటారు. కానీ ఎవరికైనా జలుబు లేదా జ్వరం లాగా చిన్నపాటి ఇన్ఫెక్షన్ కారణంగా క్యాన్సర్ వస్తుందంటే నమ్మడం కష్టమే. అయినా, ఇది అక్షరాలా నిజమని ఒక షాకింగ్ రీసెర్చ్ వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలోని ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ నిర్వహించిన కొత్త అధ్యయనం ప్రకారం కేవలం జీవనశైలి మాత్రమే కాకుండా, సాధారణంగా భావించే వైరస్‌లు, బాక్టీరియాలు కాలక్రమేణా శరీరంలో ప్రాణాంతక కణితులుగా మారుతున్నాయి. ఈ తాజా అధ్యయనం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కేవలం ఒక్క సంవత్సరం లోనే దాదాపు 23 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు కేవలం ఇన్ఫెక్షన్ల వల్లనే నమోదయ్యాయి. అంటే ఇది ప్రపంచవ్యాప్తంగా నమోదైన మొత్తం క్యాన్సర్ కేసుల్లో సుమారు 12 శాతంగా ఉంది. - సహనం వందే, హైదరాబాద్



అసలు ఏయే ఇన్ఫెక్షన్లు ఈ క్యాన్సర్‌లకు కారణం అవుతున్నాయనేది చూస్తే, కొన్ని రకాల వైరస్‌లతో పాటు ఒక నిర్దిష్టమైన బాక్టీరి యం కూడా ఈ ముప్పును కలిగిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఉదాహరణకు హెపటైటిస్ బి, సి వైరస్‌లు కాలేయ క్యాన్సర్‌కు దారి తీస్తే, హ్యూమన్ పాపిలోమా వైరస్ అంటే హెచ్‌పీవీ గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌కు ప్రధాన కారణం అవుతోంది. అలాగే హెలికోబాక్టర్ పైలోరి అనే బాక్టీరియం కడుపులో ఇన్ఫెక్షన్‌లను సృష్టించి దీర్ఘకాలంలో కణతులు ఏర్పడేలా చేస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మనలాంటి తక్కువ, మధ్య ఆదాయ దేశాలలోనే ఈ సమస్య అత్యంత తీవ్రంగా కనిపిస్తోంది. మన లాంటి దేశాల్లో జనాభా ఎక్కువ ఉండటం, అవగాహన లోపించడం, సరైన వైద్య సదుపాయాలు అందని కారణంగా ఇన్ఫెక్షన్లు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి.

టీకాలు ఆధునిక చికిత్సల ప్రాముఖ్యత

ఈ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే క్యాన్సర్లను ముందుగానే అడ్డుకునే అద్భుతమైన మార్గాలలో వ్యాక్సిన్ల ప్రాముఖ్యత ఎంతో ఉందని నిపుణులు నొక్కి చెబుతున్నారు. ఉదాహరణకు హెచ్‌పీవీ నిరోధించే వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడానికి అవకాశం ఉంది. అయితే క్యాన్సర్ కారకమైన ప్రతి వైరస్‌కు లేదా బాక్టీరియానికి నేరుగా వ్యాక్సిన్లు అందుబాటులో లేవు. హెపటైటిస్ బి కి వ్యాక్సిన్ ఉన్నప్పటికీ హెపటైటిస్ సి కి టీకా లేదు, కానీ దానిని నయం చేయడానికి ఆధునిక మందులు వచ్చాయి. అలాగే బాక్టీరియాల వల్ల వచ్చే ఇన్ఫెక్షన్లను సకాలంలో గుర్తించి యాంటీబాయోటిక్స్ ద్వారా చికిత్స చేస్తే అవి క్యాన్సర్‌గా మారకుండా ముందే అడ్డుకోవచ్చు.

ముందస్తు పరీక్షలే రక్షణ కవచం

వ్యాక్సిన్లు అందుబాటులో లేని ఇన్ఫెక్షన్ల విషయంలో ముందస్తు పరీక్షలు మన ప్రాణాలను కాపాడే కవచంలా పనిచేస్తాయి. ఉదాహరణకు మహిళల్లో క్రమం తప్పకుండా పాప్‌స్మియర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా గర్భాశయ ముఖద్వారంలో వచ్చే మార్పులను ప్రాథమిక దశలోనే పసిగట్టవచ్చు. అలాగే కడుపులో వచ్చే ఇన్ఫెక్షన్లను ఎండోస్కోపీ లేదా ఇతర సాధారణ పరీక్షల ద్వారా గుర్తించి ప్రారంభ దశలోనే నయం చేసుకోవచ్చు. తక్కువ, మధ్య ఆదాయ దేశాలలో ఈ నివారణా చర్యలు క్షేత్రస్థాయికి సక్రమంగా చేరకపోవడమే అసలు సమస్యగా మారుతోంది. ప్రభుత్వాలు చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలు మారుమూల గ్రామాలకు పూర్తిగా చేరకపోవడం వల్ల చాలా మంది ఆలస్యంగా ఆసుపత్రులకు రావడం, వ్యాధి ముదిరిపోయి ప్రాణాలను కాపాడటం కష్టమవుతోంది.

ప్రభుత్వాల చర్యలు... ప్రజారోగ్య రక్షణ

ఈ పరిస్థితిని మార్చాలంటే కేవలం వైద్యులు మాత్రమే కాకుండా ప్రభుత్వాలు కూడా ప్రజారోగ్య రంగంలో పెద్దఎత్తున నిధులు కేటాయించాలి. పాఠశాల దశ నుంచే పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. అలాగే జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో భాగంగా ప్రతి ఒక్కరికీ అందుబాటు ధరల్లో లేదా ఉచితంగా ఈ వ్యాక్సిన్లు అందేలా బలమైన విధానాలను అమలు చేయాలి. క్యాన్సర్ అని భయపడకుండా సరైన సమయంలో వేయించుకునే వ్యాక్సిన్లు, రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు, పరిశుభ్రమైన జీవనశైలితో ఇన్ఫెక్షన్లను, వాటి ద్వారా వచ్చే క్యాన్సర్లను నివారించవచ్చు.